క్లుప్తంగా

ఆకట్టుకున్న అష్టావధానం



అష్టావధానాన్ని నిర్వహిస్తున్న సాహితీవేత్తలు

చీరాల అర్బన్: తెలుగు సాహిత్యంలో అష్టావధానికి ఒక ప్రత్యేకత ఉందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. శ్రుతిభారతి చీరాల ఆధ్వర్యంలో స్థానిక పాపరాజుతోటలోని శారదామందిరంలో ఆదివారం రాత్రి అష్టావధానం నిర్వహించారు. అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు పిన్నవయసులోనే 11వ అష్టావధానాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంచాలకుడిగా యడ్లపల్లి శ్రీరామమూర్తి, నిషిద్ధాక్షరి అన్నదానం హనుమత్ ప్రసాద్, సమస్య–వంగర శ్రీధర్, దత్తపది పి.వీరాంజనేయులు, అప్రస్తుత ప్రసంగం ఎ.ఉమామహేశ్వరరావు, వర్ణన బత్తుల బ్రహ్మారెడ్డి, గీతావివరణ డీఎస్ఆర్ ఆంజనేయులు, ఆశువు ఎం.ప్రసన్న, వ్యస్తాక్షరి అబ్బరాజు ఆశ్రితసాయి పృచ్ఛకులుగా వ్యవహరించారు. అనంతరం శ్రుతిభారతి అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు అవధానిని, పృచ్ఛకులను ఘనంగా సత్కరించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



వెంకట నరసింహారావు (ఫైల్)

జే.పంగులూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో యూపీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా తోట వెంకట నరసింహారావు (51) సోమవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. చికిత్స తీసుకుంటూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం వెంకట నరసింహారావు యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. నరసింహారావుకి భార్య పద్మ, కుమారుడు గౌతం, కూతురు చరణ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సర్పంచ్ మృతి



గోవిందు (ఫైల్)

బల్లికురవ: రోడ్డు ప్రమాదానికి గురై రెండురోజుల మృత్యువుతో పోరాడి సోమవారం ఓ మాజీ సర్పంచ్ చనిపోయాడు. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు మాజీ సర్పంచ్ రావులపల్లి గోవిందు (61) శనివారం ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాత నగర్ కాలనీ వద్ద గొర్రెలు పొలం తోలి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ఢీకొట్టటంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య శేషమ్మ ఒక పర్యాయం, గోవిందు నాలుగు పర్యాయాలు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కలరు. బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి కేసు నమోదుతో గోవిందు భౌతిక కాయాన్ని పరిశీలించారు. గుడిపాడుతోపాటు పంచాయతీలోని సుజాత నగర్‌కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.





కొమ్మినేనివారిపాలెంలో పొగాకు నిల్వ కేంద్రాలుగా ఆర్ఎస్కే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

నీరుగారుతున్న లక్ష్యం.. !

- పొగాకు, వరి నిల్వ కేంద్రాలుగా ప్రభుత్వ భవనాలు
- సచివాలయ వ్యవస్థను నాశనం చేసిన వైనం
- పట్టించుకోని అధికారులు
- వినియోగంలోకి రాని భవనాలు

బల్లికురవ: ఈ ఆరు నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రైతన్నలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ అందిస్తామని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేసింది. అటు ఖరీఫ్, రబీ సీజన్‌లలో ప్రకృతి వైపరీత్యాలతో సర్వం పోయి రైతన్నలు బాధపడుతుంటే ఆదుకోకుండా చూస్తూ వేడుక చేసుకుంది ప్రభుత్వం. గ్రామాల్లోనే పౌర సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేసింది. దాదాపుగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా పూర్తి కావచ్చాయి. కాని మిగిలిన ఆ ప్రభుత్వ భవనాలను పూర్తిచేయకుండా గాలికొదిలేసింది కూటమి ప్రభుత్వం. అంతే కాకుండా పౌర సేవలను ప్రజలకు దూరం చేస్తోంది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థలోని వలంటీర్లను దూరం చేసింది. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం



హెల్త్ క్లినిక్ భవనంలో ఇలా..

చేస్తూ ఉద్యోగులను పింఛన్ల పంపిణీకే పరిమితం చేసింది. గ్రామ స్వరాజ్యం గాడితప్పి పాలన అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లోని అసంపూర్తి భవనాల పనులను పూర్తి చేయించకపోవడం, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్ల అసంపూర్తి పనులతో వినియోగంలోకి రావడం లేదు. వినియోగంలో లేని భవనాలను పొగాకు, వరి నిల్వ కేంద్రాలుగా వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

పెండింగ్ బిల్లులు చెల్లించని ప్రభుత్వం..

బల్లికురవ మండలంలో 20 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో కొప్పరపాలెం, ఉప్పుమాగులూరు -1, 2, వేమవరం, గుంటుపల్లి, గ్రామాల్లో సచివాలయాలు, వేమవరం, ఉప్పుమాగులూరు-1, గుంటుపల్లి, కొప్పరపాలెంలో రైతు సేవా కేంద్రాలు వినియోగిస్తున్నారు. బల్లికురవ, వెలమవారిపాలెం,

> **అసంపూర్తి భవనాలపై నివేదిక పంపాం..**
>
> గ్రామాల వారిగా చేపట్టిన ప్రభుత్వ భవనాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. సచివాలయం, రైతు సేవాకేంద్రాలు, హెల్త్ క్లినిక్, భవనాలు 25 శాతం కన్నా తక్కువ పనులు జరిగి ఉంటే ఆ వివరాలను, 25 శాతం పైచిలుకు పూర్తయిన భవనాల వివరాలను నివేదించాం. ప్రభుత్వం నుంచి నివేదిక రాగానే అసంపూర్తి పనులను పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తాం. భవనాల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఎంబుక్ రికార్డింగ్ ప్రకారం బిల్లులు ఖాతాలకు జమవుతున్నాయి. ప్రభుత్వ భవనాలను ప్రైవేట్ వ్యక్తులు ఆధీనంలోకి తీసుకొని ధాన్యం నిల్వ గోడౌన్‌గా మార్చటం చట్టరీత్యా నేరం.
>
> – కుసుమ కుమారి, ఎంపీడీవో

కొమ్మినేనివారిపాలెం, అంబటిపూడి, కొప్పరపాడు, చెన్నుపల్లి, కొణిదెన, ముక్తేశ్వరం, వైదన గ్రామాల్లో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. తాము చేసిన భవన నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు. అప్పులు తెచ్చిపనులు చేశామని, అప్పులకు వడ్డీలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్ఐవీ నిర్మూలనలో కృషి అవసరం

మేదరమెట్ల: హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని బాపట్ల జిల్లా ఇంటిగ్రేటెడ్ ప్రివెన్షన్ ఆఫ్ హెచ్ఐవీ ఎయిడ్స్ (దిశా) క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీబాషా పేర్కొన్నారు. సోమవారం కొరిశపాడు మండలం మేదరమెట్లలోని హెల్ప్ టీఐ ప్రధాన కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలన కోసం అవుట్ రిచ్ వర్కర్స్, పీర్ ఎడ్యుకేటర్స్ ఈఎస్ఎం, ఎంఈఏలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. మార్టూరు, అద్దంకి, నాగులప్పలపాడు, కొరిశపాడు మండలాల సిబ్బందికి ఒకరోజు సిబ్బందికి హెల్ప్ టీఐ ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ మనం పనిచేసే ప్రాంతాల్లో కొత్తగా హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగుల సంఖ్య పెరగకుండా చూడాలన్నారు. విప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ మాట్లాడుతూ ఒక మంచి లక్ష్యంతో చేస్తే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలించడం అసాధ్యమైన విషయ కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొంతమంది హెచ్ఐవీ సంస్థ విముక్తి లీగల్ కోఆర్డినేటర్ జొన్నలగడ్డ జయప్రద నిధులతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. మేనేజర్ కోటేశ్వరావు, ఎంఈఏ అనిల్ కుమార్, దుర్గా, ఎం.మల్లేశ్వరి, పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



స్వామి వారిని దర్శించుకున్న భద్రారెడ్డి, నరసింహారెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. రూ.2.40 కోట్లతో సర్వాంగ సుందరంగా గుడి పునఃనిర్మాణం జరిగింది. తెల్లావారు జామున 4.50 గంటల నుంచి 5.45 గంటల మధ్య స్వామి వారితో పాటు ద్వారా పాలకులు, విమాన శిఖర కలశ, జీవధ్వజాధి పీఠారోహణం, వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో స్వామివారిని మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వైవీ భద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారిని దర్శించుకున్న వేలాది మందికి ఆలయ కమిటీ అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో చింతల రమేష్ (ఎస్ఆర్ఐ), సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, ఎంపీటీసీ రాంబాబు, గ్రామ నాయకులు జంపాని రవి, జంపాని రాజా, సొసైటీ అధ్యక్షుడు వెంకన్నబాబు, వైస్ సర్పంచ్ చింతల రజని రాఘవయ్య, కరణం ఆంజనేయులు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్ మనందరి బాధ్యత

చినగంజాం: కిశోర్ బాలికల ఉజ్వల భవిష్యత్‌ను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీఓ ఎంవీ శ్రీనివాసమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇంకొల్లు సీడీపీఓ టీ ఝాన్సీ ఆధ్వర్యంలో కిశోర్ బాలికలకు సంబంధించి కిశోర్ వికాసం పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాల్య వివాహాలు, యుక్తవయస్సులో గర్భవతి కావడం, పోక్సో యాక్ట్, డ్రాపవుట్స్, పిల్లల మనస్తత్వం, పిల్లల స్కిల్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్, ఆడపిల్లల బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి పలు అంశాలపై శిక్షణ కార్యక్రమంలో వివరించారు. గ్రామ స్థాయిలో 11 మంది సభ్యులతో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ ఏర్పాటు చేసి అంశంపై వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుబ్బారావు, వైద్యాధికారి విజయభాస్కర్, హెచ్ఎం కుర్రా రామారావు, పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



సర్వేయర్లకు సూచనలందిస్తున్న తహశీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తే ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు ఉండవని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయాల సర్వేయర్లుతో తహశీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా భూమి సర్వే, కొలతలు, స్కెచ్‌ల అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. సచివాలయాల సర్వేయర్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తే ప్రజల మన్ననలు పొందుతారని లేకుంటే పలు ఇబ్బందులు పడుతారన్నారు. ప్రతీ అర్జీకి నిర్ణీత వ్యవధిలోగా విచారించి అర్జీదారుల సమస్యలను పరిష్కరిచాలన్నారు. ప్రతీ సర్వేయరు విధిగా క్షేత్ర సందర్శన చేయాలని, అన్నీ రికార్డులు పక్కాగా ఉండి ఉంటేనే ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, వీఆర్వోలు, సచివాలయాల సర్వేయర్లు ఉన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

బల్లికురవ: పొలాల్లో పేకాట ఆడుతున్నారని జూదరుల ఆటకట్టించారు పోలీసులు. మండలంలోని కొణిదెన గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నారని ఎస్బీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్సై జీవీ చౌదరి, సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని మంగళవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు. జూదం, కోడిపందేలు నిర్వహించడటం చట్టరీత్యా నేరమని, ఎంతటివారిపై నైనా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గణితంలో రాణిస్తే ఉన్నత భవిష్యత్



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ మురళి

చీరాల అర్బన్: గణితంలో రాణిస్తే ఉన్నత భవిష్యత్ ఉంటుందని అధ్యాపకులు పేర్కొన్నారు. పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సోమవారం గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.మురళి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలానే డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని షేక్ రబీనా శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, గణితంలో ఆయన సాధించిన విజయాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో 50 మంది విద్యార్థినులు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.జయశ్రీ, అధ్యాపకులు రత్నపాప, సురేష్‌లు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

అద్దంకి రూరల్: హెల్మెట్ వాహనదారులకు రక్షణ కవచంగా పనిచేస్తుందని అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక భవానీ సెంటర్‌లో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి వాడాలన్నారు. ట్రాఫిక్ రూల్ అతిక్రమించి హెల్మెట్ వాడకపోయిన జరిమానాలు విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ముఖ్య అతిథి మల్లేశ్వరరావు

వేటపాలెం: విద్యార్థులను చదువులతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే ట్రస్టు ప్రధాన లక్ష్యం అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది సమ్మెటివ్ పరీక్షల్లో, క్రీడల్లో వివిధ సృజనాత్మక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రొండా వేణుగోపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడైతే గురువులు గౌరవించబడతారో ఆ సమాజం, పిల్లలు అభివృద్ధి చెందుతారన్నారు. ట్రస్ట్ చైర్మన్ చిన్నమ్మాయి, ట్రస్ట్ ప్రతినిధి రొండా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ట్రస్టు తరఫున మరింత సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం పాగడ దండ రామయ్య, రొండా రామకృష్ణ, బోయిన సుబ్బారావు, చెరుకూరి నాగేశ్వరరావు, కోలా సత్యం, యాదల సుబ్బారావు, రాంబాబులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, ఊటుకూరి శ్రీమన్నారాయణ, హెచ్ఎం శేఖర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కాలేజీ క్రీడాకారుల ప్రతిభ



గెలుపొందిన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కి చెందిన వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి విజేతలుగా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పోటీలు నిర్వహించారు. షటిల్ బాడ్మింటన్ పోటీల్లోనూ సింగిల్స్‌లో ఎం సురేష్‌కిరణ్, డబుల్స్‌లో ఎం సురేష్ కిరణ్, కే రిషిల జట్లు ఫైనల్స్ గెలిపొంది విన్నర్స్‌గా నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. పరుగు పందెంలో 300 మీటర్లలో ఎస్ శ్రీకర్‌ప్రసాద్, విన్నర్ నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె జగదీశ్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ కె విజయ భాస్కర్ రెడ్డి, మేనేజర్ ఆర్వీ రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రేమ, ఆరాధనల సమాహారమే క్రిస్మస్



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కుంకలమర్రు విద్యార్థులు



చినగంజాంలో కేక్ కట్ చేస్తున్న అధికారులు

- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

యద్దనపూడి: ప్రేమ, ఆరాధనల సమాహారమే క్రిస్మస్ ముఖ్య ఉద్దేశమని పాస్టర్ సీహెచ్ హనోకు అన్నారు. సోమవారం మండలంలోని యనమదల ఎల్ఎఫ్ఈ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లోకరక్షకుడైన క్రీస్తు రాకను కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా రిటైర్డ్ టీచర్ ఉపాధ్యాయురాలు పుష్పవేణి దైవసందేశాన్ని అందించారు. మండల కేంద్రం యద్దనపూడి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మహ్మద్ ఆఖీబ్ జావెద్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్ జెస్సీడేనియల్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ టీవీ కృష్ణ, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

చీరాల టౌన్: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెవెన్యూ ఉద్యోగుల సమక్షంలో ఆర్డీవో, తహశీల్దార్, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, ఎస్టీవో సుబ్బారావు, డీటీ అర్జున్, ఇతర అధికారులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అర్జున్, సర్వేయర్ బ్రాహ్మణయ్య, ఈడీటీ సుశీల, వీఆర్వోలు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చీరాలలో కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహశీల్దార్ గోపీకృష్ణ

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలోని బార్ అసోసియేషన్ హాలులో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రెవరెండ్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాక్య సందేశం అందించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహాన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్ పాల్గొని న్యాయవాదులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్ బాబు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమతత్వంతో ఏదైనా సాధించవచ్చు..

కారంచేడు/చినగంజాం: మండల పరిధిలోని కుంకలమర్రులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీసీలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కేక్ కట్ చేశారు. చిన్నారులు వేషధారణలతో హాజరై వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.నాగమణి, వి.బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



యనమదలలో వేడుకలు నిర్వహిస్తున్న అతిథులు



చీరాలలో క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

చినగంజాంలో..

ప్రేమతత్వంతో ఏదైనా సాధించవచ్చని మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం రాత్రి మండల తహసీల్దార్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎం రత్నశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తోటివారితో సోదర తత్వం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి సెమీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీనివాస్ మూర్తి, వెలుగు ఏపీఎం సుబ్బారావు, పిఆర్ఏఈ దాసు, ఎస్ఐ శీలం రమేష్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా జాతీయ రైతు దినోత్సవం



రైతును సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ప్రధాని చరణ్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ చరణ్‌సింగ్ జయంతిని ప్రతి ఏడాది రైతు దినోత్సవంగా ప్రభుత్వం జరుపుకుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ పంటలు పండించే గోవాడ రైతు నరిశెట్టి రమేష్‌ను నూతన వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకర రావు, షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, అద్దంకి లెవీ ప్రసాద్, ఉబ్బా దేవపాలన, తదితరులు పాల్గొన్నారు.

26న జాండ్రపేటలో గంధ మహోత్సవం



కార్యక్రమాల వివరాలు వెల్లడిస్తున్న దర్గా భక్త బృందం

చీరాల: మండలంలోని జాండ్రపేటలోని దాదా అమీన్ పీర్ దర్గా వద్ద 49వ గంధ మహోత్సవాన్ని గురువారం సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తున్నట్లు దర్గా భక్త బృందం సోమవారం తెలిపారు. గురువారం రాత్రి 12 గంటలకు గంధాన్ని మెరవణి దర్గా నుంచి బయలుదేరి ఫకీర్ల జల్సాలతో, విద్యుత్ దీపాలతో, బాణాసంచాలతో జాండ్రపేట వీధుల్లో నగరోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం కడప పెద్ద దర్గా పీఠాధిపతులు హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లాచే గంధం చదివింపులు జరుపుతారన్నారు. శుక్రవారం సాయంత్రం అఖండ దీపారాధన, శనివారం ఉదయం తెహలీల్ ఫాతెహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంధ మహోత్సవానికి భక్తులందరూ హాజరు కావాలని కోరారు.